క్లుప్తంగా

రేపు కేంద్ర బృందం పర్యటన

యాచారం: మండలంలో గురువారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల బృందం పర్యటించనుందని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ నర్సింహులు చింతపట్లలో పర్యటించి ప్రభుత్వ పథకాలను పరిశీలించారు.గడ్డమల్లయ్యగూడ, యాచారం, చింతపట్ల, నస్దిక్‌సింగారం తదితర వాటిల్లో ఏదో ఒక గ్రామంలో బృందం పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిశీలిస్తుందని ఎంపీడీఓ తెలిపారు.

శ్రీనివాస్‌గౌడ్‌కు సన్మానం



మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించిన నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలోని కృష్ణగౌడ్ ఇంటికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నిర్మల తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని శ్రీనివాస్‌గౌడ్ వారికి సూచించారు. నాయకులు.. శ్రీశైలంగౌడ్, కృష్ణగౌడ్, యాదయ్య, శ్రీశైలం, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను బుధ, గురువారాల్లో వైభవంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఉత్సవాలు జరిగే రెండురోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లికి చెందిన నారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ సత్యం మంగళవారం పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన సుశీల అనారోగ్యంతో (53) మంగళవారం మృతి చెందింది. మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.6000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హైమావతి, రామస్వామి, శ్రీను, శేఖర్, శంకరయ్య, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, చెన్నయ్య, నిరంజన్, నర్సింహ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటాం

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: నిరుపేదలకు సేవలందించడమే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్‌తండాకు చెందిన బోడియా, సాలార్‌పూర్‌కి చెందిన కర్రె కుర్పయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాలను మంగళవారం జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. అదే విధంగా బాధిత కుటుంబానికి సాలార్‌పూర్ ఎంపీటీసీ ప్రియారమేశ్ రూ.3వేలు సాయం అందించారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ సువాలి, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం, నాయకులు శ్రీను, పంతునాయక్,బాబా, శంకర్, గోపాల్, జైపాల్, శ్రీను దాస్య,కుమార్ తదితరులు ఉన్నారు.

కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత ఇంటర్ విద్య

ఎంఈఓ సయ్యద్ అక్బర్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వం ఇంటర్మీడియేట్‌లో ఉచిత కార్పొరేట్ విద్యను అందించే అవకాశం కల్పిస్తోందని ఎంఈఓ సయ్యద్ అక్బర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఉచిత కార్పొరేట్ విద్యకు ఈనెల 30వ తేదీవరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన కనీసం 7 జీపీఏ సాధించిన విద్యార్థులుఇంటర్‌లో కార్పొరేట్ విద్యను ఉచితంగా పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఇంటర్మీడియేట్‌లో ఎంపిక చేసిన మూడు కళాశాలలో సీట్లు కేటాయిస్తారన్నారు. విద్యార్థులు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 3న ఎంపిక జాబితా ప్రకటిస్తారు. 6 నుంచి సర్టిఫికెట్లు పరిశీలన ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాల వివరాలతో కూడిన సమాచారం ఇస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ, వర్గాలకు చెందిన వారై ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలైన జెడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద చదివిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏఓలు అరుణకుమారి, శ్రీలత
- రైతులకు అవగాహన కార్యక్రమాలు
- పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు



ఆమనగల్లు: మంగళపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల స్టాక్‌ను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసేవాటికి బిల్లులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా షాపుల యజమానులు సామల రవి, వెంకటయ్య, నర్సింహారెడ్డి, సురేందర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి కోరారు. ఆమనగల్లు మండల పరిధిలోని మంగళపల్లి, చింతపల్లి, విఠాయిపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలు, పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాణి, మీనాక్షి, రైతులు.. జంగయ్య, కొండల్‌రెడ్డి, మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: ఫర్టిలైజర్ దుకాణాల నుంచి విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత అన్నారు. మండల పరిధిలోని మద్దెలకుంట తండా, ఎక్వాయిపల్లి, గోవిందాయిపల్లి జీపీల్లో వానాకాలం -2024 సీజన్‌కు సంబంధించి విత్తనాల కొనుగోలుపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లూజుగా ఉన్న సంచుల్లో విత్తనాలు కొనుగోలు చేయరాదని, విత్తన ప్యాకెట్, రసీదు బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని.. ప్రతి విత్తన ప్యాకెట్ మీద విత్తనం తయారైన తేదీ, ఎక్స్‌పైరీ తేదీ చూసుకోవలని సూచించారు. విస్తరణ అధికారులు వందన, అభినవ్‌రెడ్డి, కేదార్‌సింగ్ రైతులు పాల్గొన్నారు.

మాడ్గుల మండలంలో..

మాడ్గుల: మండల పరిధిలోని రామదుగ్యాల, గిరికొత్తపల్లి, కోల్కులపల్లి, గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ విస్తారణ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ వున్న డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జోష్న, వాహిని, రాధమ్మ, రాజేష్ నాయక్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో ఎమ్మెల్యే పూజలు



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: యాచారం మండలం చౌదర్‌పల్లిలోని శ్రీ హరిహర దివ్య క్షేత్రంలో మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామంలో గతేడాది గ్రామస్తులు శ్రీ హరిహర దివ్య క్షేత్రాన్ని నిర్మించారు. ఈ క్రమంలో రెండు రోజులుగాదివ్యక్షేత్రం ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. అందులో భాగంగా ఎమ్మెల్యే పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తిభావంతో ప్రశాంతత నెలకొంటుందని అన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, అమృతాసాగర్, అరవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. కవిత

భగవద్గీత కంఠస్థ పోటీల్లో గోల్డ్‌మెడల్



కవిత సంపత్‌కుమార్ దంపతులను సన్మానించిన నాయకులు

కడ్తాల్: గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన కవిత గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవిత సంపత్‌కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గుప్తా మాట్లాడుతూ.. భగవద్గీతలోని 700 శ్లోకాలు కంఠస్థం చేసుకుని చూడకుండా అవలీలగా చెప్పడం చాలాగొప్ప విషయమని ప్రశంసించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి రాముగుప్తా, ఉపాధ్యక్షులు పద్మనారాయణ, సంఘం యువజన విభాగం అధ్యక్షుడు వీరేందర్‌గుప్తా, వెంకటయ్యగుప్తా, రఘుగుప్తా, వీరేశ్, రాకేశ్, మోహన్‌గుప్తా తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి రానివ్వొద్దు

జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



గుర్లకుంట చెరువును పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలో నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కడ్తాల్‌లోని గుర్లకుంట చెరువును పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో చెరువు నిండి, చెరువులోని బోర్ మోటార్లు చెడిపోతే మరమ్మతులు చేయడానికి దారిలేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని కార్యదర్శి ఆయనకు వివరించారు. చెరువులో గల బోరు మోటార్ల వద్దకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయిస్తానని శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. అదే విధంగా చెరువులో బోరు మోటార్ల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు తాగునీటి అవసరాలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ వార్డు సభ్యులు మల్లయ్య, బ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

దాతల సాయంతో ఆలయ అభివృద్ధి

మహేశ్వరం: మామిడిపల్లిలోని బాలాజీ దేవాలయంలో ఉత్తర, పడమర ద్వారం పనులు పూర్తి కావడాన్ని పురస్కరించుకొని ఆలయ పాలక మండలి సభ్యులు మంగళవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. పడమరవైపు సాల హరమును దాత దామోదర్ సచిన్ సోని, ఉత్తరం వైపు సాల హరమును కృష్ణారెడ్డి, రఘువీర్‌రెడ్డి, ఎడ్ల వాసుదేవారెడ్డిలు, ఉత్తర ద్వారం తలుపును జితేందర్‌రెడ్డి నిర్మించినందుకు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్ వాల్మీకి, సభ్యులు పద్మశంకర్‌గౌడ్, పెండ్యాల కృష్ణనాయి, సహదేవ్, అశోక్, అర్చకుడు సుధీర్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాల 1998-99 బ్యాచ్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాల 1998–99 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. బొంగ్లూర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఈ వేడుక ఘనంగా జరిగింది. దాదాపు 25 సంవత్సరాలు తర్వాత అందరూ ఒక్కచోట చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో వారికి చదువు చెప్పిన గురువులు నెల్సన్, జగన్‌రెడ్డి, బాల్‌రాజ్, డేవిడ్, మల్లారెడ్డి, శేఖర్, బాలన్నను ఘనంగా సన్మానించారు.

ఆధార్ కేంద్రాలు లేక అవస్థలు

- గంటల తరబడి ప్రజలకు తప్పని నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు

చేవెళ్ల: ప్రతీ ఒక్కరికి ఇప్పుడు ఆధార్ కార్డు లేనిది ఏ పని జరగడం లేదు. ఈ కార్డు విలువ అంతగా పెరిగింది కానీ ఈ ఆధార్ కేంద్రాలు మాత్రం పెరగటం లేదు. ఉన్నవి తొలగించి నియోజకవర్గంలో ఒకటి, రెండు చోట్లు ఏర్పాటు చేయటంతో అందుబాటులో సరైనా కేంద్రాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో పోస్టాఫీస్ వద్ద ఉన్న ఒకే ఒక్క ఆధార్ కేంద్రం వద్ద మంగళవారం ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. నియోజకవర్గానికి ఈ కేంద్రం ఒక్కటే ఆధారం. ఇక్కడ ప్రతీ రోజు ఆధార్‌కార్డుల కోసం వచ్చే జనం ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలైన్‌లో వేచి ఉండాల్సి వస్తోంది. ఇక్కడ ఒక వ్యక్తి ఒక కంప్యూటర్‌తో రోజుకు 20–30కి మించిన కార్డులకు చేయటానికి రాదు. వృద్ధులు, చిన్నపిల్లలు అందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ కేంద్రానికి ఇతర మండలాలు, గ్రామాల నుంచి ఆధార్‌కార్డులలో మార్పులు, చేర్పులు, ఫోన్ నెంబర్ లింక్ చేయటం, వేలిముద్రలు సరిపోకపోవటంతో మళ్లీ అప్‌డేట్ చేసుకునేందుకు, కొత్తగా పిల్లలకు ఆధార్‌కార్డులు తీసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. గతంలో మీసేవ కేంద్రాల్లో నిరంతరం అందుబాటులో ఉండేవి. వాటి నుంచి తొలగించిన నాటి నుంచి ఆధార్ కేద్రాలకు ఇబ్బందులు తప్పటం లేదు. ప్రజల అవసరాల మేరకు మండల కేంద్రానికి ఒక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తేనే ఉపయోగం ఉంటుందని.. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యూనిఫాంలను సకాలంలో అందించాలి

ఎంపీపీ కొప్పు సుకన్య



యూనిఫాం క్లాత్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ సుకన్య

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలను అందించాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో నిర్వహిస్తున్న యూనిఫాం కటింగ్ సెంటర్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. యూనిఫాం కటింగ్‌ను వేగవంతం చేసి పాఠశాలలు పునఃప్రారంభమయ్యేల్లోపు విద్యార్థులకు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనిఫాం సైజ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని.. కొలతల ప్రకారం కుడితే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

నీటిశుద్ధి కేంద్రాలపై చర్యలు తీసుకోండి

బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్



వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నేతలు

తలకొండపల్లి: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నీటి శుద్ధి కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్యాంసుందర్‌ను కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ.. వాటర్ ప్లాంట్ల యజమానులకు నీటిశుద్ధిపై సరైన అవగాహన లేదని అన్నారు. నీటిరుచి కోసం కెమికల్స్‌ను అధికమోతాదులో వాడటంతో పాటు నీటి వ్యర్థాలను వేరుచేసే ఫిల్టర్‌లను సమయానుకూలంగా మార్చడం లేదని అలాగే నీటినిల్వ ట్యాంకనర్లను రెగ్యులర్‌గా శుభ్రపర్చడం లేదన్నారు. దీంతో ప్రజలు రోగాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ ప్లాంట్ల యజమానులకు శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, అరుణ్, పరమేష్, రవి, కుమార్, శ్రీనివాస్, రాము, శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించండి

తమ్మలోనిగూడ జీపీ ఎదుట కూలీల ధర్నా



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

యాచారం: మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలు మంగళవారం ధర్నా నిర్వహించారు. గ్రామంలోని రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఉపాధి పనులు చేయనివ్వడం లేదని, ఈజీఎస్ అధికారులు పనులు లేవని చెప్పడంతో వెంటనే ఉపాధి పనులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో ఉన్న 90 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఉపాధి పనులు కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలిచ్చినా స్పందన లేదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య ఉపాధి కూలీలకు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. కూలీలకు పనులు కల్పించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు జంగారెడ్డి, సుగుణమ్మ, ప్రమీల, లక్ష్మమ్మ, రాంరెడ్డి, నర్సింహ, యశోద, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ సన్నిధిలో సబితారెడ్డి



మైసిగండి మైసమ్మను దర్శించుకున్న సబితారెడ్డి, నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండిలో కొలువైయున్న మైసమ్మ దేవతను మంగళవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా వీపీజీ ఫౌండేషన్

పీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, ఫౌండేషన్ చైర్మన్ వజీర్ ప్రకాష్‌గౌడ్

నాగోలు: పేదలకు అండగా వీపీజీ ఫౌండేషన్ ఉంటుందని పీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్, ఫౌండేషన్ చైర్మన్ వజీర్ ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ప్రకాష్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లోని శ్రీ మల్లికార్జున వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పేదలకు చీరలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తన నివాసంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్యకార్మికులకు చీరలను పంపిణీ చేశారు. నిరుపేదలకు ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

దివంగత నటుడు, ఉమ్మడి ఆధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని మంగళవారం ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు టీడీపీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. నటనతో ప్రేక్షకులను మెప్పించడంతో పాటు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మనస్సులో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నేతలు



తుర్కయంజాల్: జయంతి వేడుకలో టీడీపీ నాయకులు



ఆమనగల్లు: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు